మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు వచ్చిన కేటీఆర్‌ను.. కేసీఆర్ సారు ఎట్లున్నడయ్యా.. అని అడుగుతున్న వృద్ధురాలు మల్లవ్వ

బతుకమ్మ చీరల ఉత్పత్తి కొనసాగేలా చేస్తా

- బకాయిలు ఇప్పించేందుకు కృషి
- విలీన గ్రామాలు యథాతథం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హామీ
- సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృత పర్యటన

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ చీరల ఉత్పత్తి యథావిధిగా కొనసాగేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ వస్త్ర ఉత్పత్తిదారులకు హామీఇచ్చారు. 'ఆగం కాకండి.. అండగా నేనున్నా'నంటూ యజమానులకు భరోసా కల్పించారు. పెండింగ్‌లో ఉన్న బతుకమ్మ చీరల డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరెడ్డి, ముస్తాబాద్‌లోని నల్ల నర్సయ్య నివాసంలో శుభకార్యానికి హాజరయ్యారు. ముస్తాబాద్‌లో యూత్ నాయకుడు రాచమడుగు సంతోష్‌రావును కేటీఆర్ పరామర్శించారు. సంతోష్‌రావు తండ్రి కిషన్‌రావు ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడి నుంచి సిరిసిల్ల పట్టణానికి చేరుకొని బీవైనగర్‌లోని కౌన్సిలర్ దార్ల కీర్తన సందీప్, తవుటు కనుకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని వస్త్ర ఉత్పత్తి దారులతో సమావేశమయ్యారు. మరమగ్గాల పరిశ్రమ అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందని, అందుకు తాను శాయశక్తులా కృషి చేస్తానని భరోసా కల్పించారు. కార్మికులు, వస్త్ర పరిశ్రమ, అపారెల్, టెక్స్‌టైల్ పార్కుల అభివృద్ధిపై సుదీర్ఘంగా వారితో చర్చించారు. సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామాలను యథాతథంగా ఉంచాలని గ్రామస్థులంతా కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానని పునరుద్ఘాటించారు. విలీన గ్రామాలన్నీ తిరిగి పంచాయతీలుగా మార్చేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపించాలని చైర్‌పర్సన్ జిందం కళకు సూచించారు. సమావేశంలో టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా, పట్టణ అధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

బాపు ఆరోగ్యం ఎట్లుందయ్యా.. కేసీఆర్ గురించి వృద్ధురాలి ఆరా

గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో ఓ శుభకార్యానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. మల్లవ్వ అనే వృద్ధురాలు కేటీఆర్‌ను ఆపాయ్యంగా పలుకరించింది. బాపు (కేసీఆర్ సారు) ఆరోగ్యం ఎట్లుందయ్యా? అని కేటీఆర్‌ను అడిగింది. మరో నాలుగు వారాలు అయితే పూర్తిగా కోలుకొని మన మధ్యకు వస్తారని కేటీఆర్ బదులిచ్చారు. దీంతో మల్లవ్వ తృప్తిపడుతూ, త్వరగా మంచిగా అయితే చాలు.. అంటూ కేటీఆర్‌కు చేతులు జోడించి దండంపెట్టింది.

కాంగ్రెస్ హామీలపై సిద్ధు వర్సెస్ కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...

ప్రజల భవిష్యత్తు కూడా కర్ణాటక మాదిరిగానే అవుతుందేమోనని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. హామీలను గుప్పించేముందు వాటి సాధ్యాసాధ్యాలపై కనీసం ప్రాథమిక అధ్యయనం చేయడం కానీ, ప్రణాళికలు రూపొందించుకోవడం కానీ ఉండదా? అని ప్రశ్నించారు. 'ఎన్నికల్లో ఓట్లకోసం ఏదో అన్నాం అనుకోండి. అది ఇస్తాం.. ఇది ఇస్తాం అంటాం. అంతమాత్రాన అన్నీ ఫ్రీగా ఇవ్వాలా? మాకు ఇవ్వాలనే ఉన్నది. కానీ ఖజానాలో డబ్బులు లేవు' అని సిద్ధరామయ్య అసెంబ్లీలో పేర్కొన్నట్టుగా ఉన్న వీడియోను కేటీఆర్ పోస్టు చేస్తూ.. పార్లమెంటు ఎన్నికల తరువాత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇలాంటి ప్రకటనే చేయనున్నారా? అని సందేహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో రేవంత్, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీల వీడియోలు, పేపర్ క్లిప్పింగ్‌లను పోస్ట్‌చేశారు.

అది బీజేపీ సృష్టించిన ఫేక్ వీడియో: సిద్ధరామయ్య

కేటీఆర్ ట్వీట్‌పై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఎక్స్ ద్వారా స్పందించారు. 'తెలంగాణ ఎన్నికల్లో మీ పార్టీ (బీఆర్ఎస్) ఎందుకు ఓడిపోయిందో తెలుసా? ఎందుకంటే కనీసం మీరు ఫేక్ వీడియోలు, ఎడిటెడ్ వీడియోలను కూడా గుర్తించలేకపోతున్నారు. బీజేపీ వాళ్లు ఫేక్ ఎడిటెడ్ వీడియోలను సృష్టిస్తే మీ పార్టీ వాటిని వైరల్ చేస్తుంది. మీ పార్టీ బీజేపీకి పర్‌ఫెక్ట్ బీ టీమ్. మీరు వాస్తవాలు తెలుసుకోవాలనుకుంటే గతంలో బీజేపీ నాయకులు సృష్టించే ఫేక్, ఎడిటెడ్ వీడియోలపై నేను చేసిన ప్రకటన చదవండి. బీజేపీ నాపై బురద జల్లే బాధ్యతను మీ పార్టీలోని కొందరు నాయకులకు అప్పగించింది. వారు నా వీడియోలను ఎడిట్‌చేసి ఫేక్ వీడియోలను సృష్టించి వైరల్ చేస్తారు. ఫేక్ వీడియోలకు బీజేపీ పెట్టింది పేరు. అది భారతీయ జనతా పార్టీ కాదు. 'బోగ్గే జనతా పార్టీ'. ఇప్పుడు ఆ పార్టీ నేతలు నరేంద్రమోదీ నుంచి సీటీ రవి వరకు పూర్తిగా ఫేక్ వీడియోలపైనే ఆధారపడ్డారు' అని ట్వీట్ చేశారు.

కాంగ్రెస్ అబద్ధపు హామీలవల్లే మేము ఓడాం: కేటీఆర్ కౌంటర్

సిద్ధరామయ్య ట్వీట్‌పై మళ్లీ కేటీఆర్ ఎక్స్ ద్వారా స్పందించారు. 'అబద్ధపు హామీలతో మీ పార్టీ (కాంగ్రెస్) వాళ్లు తెలంగాణ ప్రజలను మోసం చేశారు. కాబట్టే మేము ఎన్నికల్లో ఓడిపోయాం. డిసెంబర్ తొమ్మిదిన ఎన్నికల హామీలు అమలుచేస్తామని, హామీలపై చట్టాలు చేస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయి? డిసెంబర్ తొమ్మిది దాటి పది రోజులు గడిచినా మీ పార్టీ ఇచ్చిన హామీలు ఇంతవరకూ నెరవేరలేదు' అని విమర్శించారు. కాంగ్రెస్ హామీలపై కేటీఆర్ ఈ క్రింది ప్రశ్నలు సంధించారు.

- రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా ఎక్కడ?
- రూ.2 లక్షల పంట రుణమాఫీ ఎక్కడ?
- రూ.4,000 సంక్షేమ పెన్షన్ ఎక్కడ?
- రూ.500 గ్యాస్ సిలిండర్ ఎక్కడ?
- మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎక్కడ?
- మొదటి క్యాబినెట్‌లోనే మెగా డీఎస్సీ ఎక్కడ?
- మొదటి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత అన్నారు కదా.. ఎక్కడ?
- ఈ హామీలు ఫేకా? లేక ఈ హామీలు ఇచ్చిన మీ నాయకులే ఫేకా?
- మూడు రాష్ట్రాల ఎన్నికల్లో మీరు ఎందుకు ఓడిపోయారో చెప్పగలరా?

మూడు రోజులు చలి తీవ్రత

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతున్నది. మరో మూడు రోజులు మరింత పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం తెలిపింది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో 12.3 డిగ్రీలు, నిర్మల్ జిల్లా పెంబిలో 13.1డిగ్రీలు, సిద్దిపేట జిల్లా కొండపాకలో 13.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 13.6 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా జిన్నారంలో 13.9 డిగ్రీలు, మంథడపల్లి జిల్లా 13.9 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో తెల్లవారుజామున పొగమంచు కురుస్తున్నది. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు నెమ్మదిగా సాగుతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 17.9 డిగ్రీలుగా నమోదైంది.

మెదక్‌లో విధులు బహిష్కరించిన హైర్ బస్సు డ్రైవర్లు

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన

- మెదక్‌లో విధుల బహిష్కరణ
- మహిళ ల ఉచిత ప్రయాణంతో ఓవర్‌లోడ్ అవుతుందని ఆవేదన
- బస్సు ఆపకపోతే మహిళ భర్త కొట్టేందుకు వచ్చాడని ఆగ్రహం
- డ్రైవర్ ఫిర్యాదు.. నిందితుడిపై కేసు

మెదక్ అర్బన్/టేక్మాల్, డిసెంబర్ 19: ప్రభుత్వం మహిళలకు కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం కారణంగా తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళన బాటపట్టారు. మెదక్ డిపోలోని డ్రైవర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. డిపోలోని 59 అద్దె బస్సుల డ్రైవర్లంతా తాత్కాలికంగా విధులు బహిష్కరించారు. డిపో ఎదుట డ్రైవర్లు మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణంతో బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతున్నారని, ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారని, రద్దీతో ఎవరు కింద పడుతారోనని భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం టేక్మాల్ రూట్‌లో ప్రయాణికులు ఎక్కువగా ఉన్నారని సోలోజిపల్లి వద్ద బస్సు ఆపక పోవడంతో ఓ ప్రయాణికురాలి భర్త ఎర్రోల్ల మోహన్ కర్రతో డ్రైవర్‌పై దాడి చేయడానికి వచ్చాడని తెలిపారు. ఈ విషయంపై టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఇదిలా ఉండగా, టేక్మాల్ రూట్‌లో బస్సు ఆపలేదని మరో ప్రయాణికురాలి భర్త అద్దె బస్సు డ్రైవర్ దూదేకుల అస్లాంపై దాడికి యత్నించినట్టు తెలిసింది.. ఆ డ్రైవర్ ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురాలేదని ఆర్టీసీ మెదక్ డిపో మేనేజర్ సుధ తెలిపారు. ఏదైనా ఇబ్బంది ఉంటే, సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రయాణికులు ఇబ్బంది పడేలా ఆకస్మికంగా బస్సులు నిలిపివేస్తే అగ్రిమెంట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

కండక్టర్ కుటుంబానికి ఆర్టీసీ అండ

- రోడ్డుప్రమాదంలో మరణించిన కండక్టర్ కుటుంబానికి రూ.40 లక్షల అందజేత
- ఆర్టీసీకి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కండక్టర్ కుటుంబానికి ఆర్టీసీ అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) సహకారంతో రూ.40 లక్షల ఆర్థికసాయం అందజేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మెదక్ డిపో కండక్టర్ సీహెచ్ అంజయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విధులు ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై అంజయ్య మృతిచెందారు. ఇంటిపెద్ద మృతితో బాధిత కుటుంబంలో విషాదం అలుముకున్నది. ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాల రీసేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాన్ని ఆదుకున్నది. ఇటీవల ఉద్యోగుల సాలరీ అకౌంట్స్‌ను ఆర్టీసీ యాజమాన్యం యూబీఐకి మార్చింది. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉన్నది. ప్రమాదాలు జరిగిన సమయంలో సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కింద (ఉద్యోగి వేతనం ప్రకారం) కనీసం రూ.40 లక్షల వరకు అందజేస్తున్నది. హైదరాబాద్ బస్‌భవన్‌లో మంగళవారం అంజయ్య కుటుంబానికి రూ.40 లక్షల విలువైన చెక్కును యూబీఐ అధికారులతో కలిసి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అందజేశారు. అంజయ్య భార్య మణెమ్మ, కుమారుడు సంతోష్ కుమార్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ వీ రవీందర్, ఈడీలు ఎస్ కృష్ణకాంత్, పీవీ మునిశేఖర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశమైన టీఏటీయూ నేతలు

సదస్సుకు భారీగా హాజరైన ఆటో డ్రైవర్లు

ఆటోడ్రైవర్లను బతకనివ్వండి

- బతుకుపోరుకు దేనికైనా సిద్ధం
- ఉచిత బస్సు స్కీంపై కోర్టుకెళ్తాం
- నెలకు రూ.15 వేలు ఇవ్వండి
- పౌర హక్కుల నేతలు స్పందించాలి
- 7న ఇందిరా పార్కులో మహాధర్నా
- ఆటో కార్మికుల సదస్సులో టీఏటీయూ నేత పిలుపు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తమ జీవన మనుగడ కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులు తేల్చిచెప్పారు. చట్టబద్ధత లేని ఉచిత బస్సు స్కీంపై కోర్టులో సవాల్ చేస్తామని తెలిపారు. ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. తమ కష్టాలపై పౌర హక్కుల నేతలు స్పందించాలని కోరారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆటో మోటర్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ (టీఏటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆటో కార్మికుల సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఆటో డ్రైవర్లు తరలివచ్చారు. ఈ సదస్సులో టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని తాము వ్యతిరేకించడం లేదని చెప్పారు. కానీ, ఆ స్కీం కారణంగా ఉపాధి కోల్పోతున్న ఆరు లక్షల ఆటో డ్రైవర్ల కుటుంబాల గురించి ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక పోరాటం కాదని, తమ బతుకు పోరాటమని చెప్పారు.

కేసీఆర్ ప్రభుత్వంలో అనేక ప్రయోజనాలు

కేసీఆర్ ప్రభుత్వంలో ట్యాక్సీల మాఫీ, 714 జీవో రద్దు, వాహన మోటర్ త్రైమాసిక పన్ను, రూ.5 లక్షల బీమా తదితర ప్రయోజనాలు కలిగాయని మారయ్య చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆటో డ్రైవర్ల మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లలో ఆటో కార్మికుల సమస్యలపై వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. జనవరి 7న ఇందిరా పార్కు వద్ద భారీ సభ నిర్వహిస్తామని చెప్పారు. కాగా, బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బస్‌భవన్ వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఆటోడ్రైవర్లు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఆటోడ్రైవర్లకు కచ్చితంగా న్యాయం చేస్తాం

- ఓపిక పట్టండి.. సమస్యలు పరిష్కరిస్తం
- రవాణాశాఖ మంత్రి పొన్నం హామీ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కచ్చితంగా న్యాయం చేస్తామని, అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో ప్రజావాణి సందర్భంగా తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్, బీఎంఎస్ అనుబంధ టీఎస్‌పీటీఎంఎం ఆధ్వర్యంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణాలపై పునరాలోచన, బస్సుల సంఖ్య తగ్గించడం, ఓలా, ఉబర్, ర్యాపిడ్ బైక్‌ల అక్రమ వ్యాపారాన్ని నిషేధించడం వంటి డిమాండ్లను ఆటో యూనియన్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చినట్టు తెలిపారు. త్వరలో ఆటో యూనియన్లతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు ఇబ్బంది పడుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఆటో వాళ్లు తమ సోదరులే అని, వాళ్లకు కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజావాణికి వేలాది దరఖాస్తులు

ప్రజావాణికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రజల సమస్యలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన వారిలో అత్యధికంగా అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణికి విశేష స్పందన వస్తున్నదని తెలిపారు. మంగళవారం ప్రజావాణికి 5,126 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.

21న ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ మహాధర్నా

- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి
- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్

జూబ్లీహిల్స్, డిసెంబర్ 19: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ చెప్పారు. ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాదిగలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో 28 ఏండ్లుగా టీఎమ్మార్పీఎస్ చేస్తున్న తుది పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ అంశంపై పలు మార్లు వంచించిన బీజేపీ తీరుకు నిరసించాలని పిలుపునిచ్చారు.

కార్మికులకు వేతన సెలవుల నిర్ధారణ

కార్మికశాఖ నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఫ్యాక్టరీస్, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టాల ప్రకారం 2024 సంవత్సరంలో కర్మాగారాలు, దుకాణాలు, ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో పనిచేసే కార్మికులకు జాతీయ పండుగలు, ఇతర సెలవు దినాలను నిర్ధారిస్తూ కార్మికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ దినాల్లో కార్మికులకు వేతనాలతో కూడిన సెలవులు ఉంటాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. కర్మాగారాల్లో పనిచేసేవారికి సంక్రాంతి, రిపబ్లిక్ డే, ఉగాది, రంజాన్, మేడే, స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి, విజయ దశమి ఇలా ఎనిమిది సెలవులు ఉండగా, దుకాణాలు, ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో పనిచేసేవారికి సంక్రాంతి, రిపబ్లిక్ డే, మహాశివరాత్రి మరుసటిరోజు, రంజాన్, మేడే, తెలంగాణ వ్యవస్థాపక దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి, విజయదశమి ఇలా తొమ్మిది సెలవులను నిర్ధారించారు.

వచ్చే ఏడాది వేతన సెలవులు ఇలా..

పండుగ/ ఇతర సెలవు	తేదీ
సంక్రాంతి	జనవరి 15
రిపబ్లిక్ డే	జనవరి 26
శివరాత్రి మరుసటిరోజు	మార్చి 9
ఉగాది	ఏప్రిల్ 9
రంజాన్	ఏప్రిల్ 11
మేడే	మే 1
తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం	జూన్ 2
స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15
గాంధీ జయంతి	అక్టోబర్ 2
దసరా	అక్టోబర్ 12